సాక్షి
మెదక్

సోమవారం । 3 । జూన్ । 2024

7



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్పీ బాలస్వామి

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో ఆవిర్భావ వేడుకలు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్‌జోన్: జిల్లా కోర్టు ప్రాంగణంలో తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద జాతీయ జెండాను ఆవిష్కరించి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



మురళీధర్‌గౌడ్ దంపతులకు పాదపూజ నిర్వహిస్తున్న కుమారులు

రామాయంపేట(మెదక్): తల్లిదండ్రులను గౌరవించాలనే సంప్రదాయాన్ని నేటితరం పిల్లలకు గుర్తు చేయడానికి ఆదివారం పట్టణానికి చెందిన ఐరేని కుటుంబ సభ్యులు తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన బలగం ఫేమ్ ఐరేని మురళీధర్‌గౌడ్ దంపతులకు ఆయన కుమారులు పాదపూజ చేశారు. కనిపెంచిన తల్లిదండ్రులను గౌరవించడం బాధ్యతగా గుర్తుంచుకోవాలని మురళీధర్‌గౌడ్ సూచించారు.

బడిబాట వాయిదా: డీఈఓ

మెదక్ కలెక్టరేట్: సోమవారం నుంచి నిర్వహించాల్సిన బడిబాట కార్యక్రమం ఎన్నికల కోడ్‌తో పాటు ఇతర కారణాలతో వాయిదా పడినట్లు డీఈఓ రాధాకిషన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాత ప్రారంభిస్తామని తెలిపారు.

మల్లన్న పట్నాలు.. భక్తుల మొక్కులు



గంగిరేణి చెట్టు వద్ద భక్తుల పట్నాలు

కొమురవెల్లి (సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆలయ పరిసరాలు మల్లన్ననామ స్మరణతో మారుమోగాయి. స్వామి వారిని సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. అభిషేకాలు, పట్నాలు, ఒడిబియ్యం, అర్చనలు, కేశ ఖండన, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన గల రేణుక ఎల్లమ్మకు బోనం సమర్పించి చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు.

రూ.2 లక్షల బీమా సదుపాయం

వర్గల్(గజ్వేల్): జిల్లా సహకార బ్యాంకు(డీసీసీబీ)లో ఖాతా తెరిచిన వినియోగదారులకు రూ.2లక్షల ఉచిత బీమా సదుపాయం లభిస్తుందని వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం వర్గల్‌లోని జిల్లా సహకార బ్యాంకు శాఖలో డిపాజిట్ సేకరణ మాసోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

అమరుల త్యాగ ఫలమే తెలంగాణ

■ అన్నిరంగాల్లో జిల్లా అభివృద్ధి ■ దశాబ్ది వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్/మెదక్ కలెక్టరేట్: ఎంతోమంది అమరుల త్యాగఫలమే తెలంగాణ రాష్ట్రమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధించిన ఘనతను నలుదిక్కులా చాటడంతో పాటు ప్రజల జీవితంలో వచ్చిన మార్పును తెలియజేసేలా దశాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యమకారులు, ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాల ఫలితమే దశాబ్దాల కల నెరవేరిందని గుర్తుచేశారు. జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ఉంచడంలో తమవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేష్, ఆర్డీఓ రమాదేవి, డీఆర్‌ఓ పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

మెదక్ మున్సిపాలిటీ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలిసికట్టుగా పనిచేసి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచిన డీఎస్పీ సైదులు, కొల్చారం ఎస్ఐగౌస్, తూప్రాన్ ఏఎస్ఐ మల్లప్ప, అల్లాదుర్గ హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌తో పాటు పలువురికి ఉత్తమ సేవా పతకాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేశ్‌లతోపాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మెదక్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- 121 టేబుల్స్, 149 రౌండ్స్‌లో లెక్కింపు
- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: మెదక్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి సోమవారం రెండో విడత శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు. మంగళవారం ఉదయం 5 గంటలకు మూడవ ర్యాండమైజేషన్ ఉంటుందన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ మైక్రో అబ్జర్వర్లకు కౌంటింగ్ ప్రక్రియపై ముందే శిక్షణ ఇచ్చామని వివరించారు. నర్సాపూర్‌లోని బీవీఆర్ ఐటీ కళాశాలలో మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ జరుగుతుందన్నారు. అలాగే నర్సాపూర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. బీవీఆర్ ఐటీ ఆడిటోరియంలో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉంటుందన్నారు. కౌంటింగ్ హాల్‌లో సీసీ కెమెరాలను అమర్చినట్లు వెల్లడించారు. మొత్తం 121 టేబుల్స్‌లో 149 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని వెల్లడించారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి కౌంటింగ్ సిబ్బందికి రెండో ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈసందర్భంగా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల కౌంటింగ్ అబ్జర్వర్ సమన్‌జిత్ సేన్ గుప్త, సంగారెడ్డి, పటాన్‌చెరు కౌంటింగ్ అబ్జర్వర్ ప్రజాపతి మాట్లాడుతూ.. కౌంటింగ్ విషయంలో ఏమైనా సమస్యలుంటే 7815906368, 7815905679 నంబర్లలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీఓ రమాదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేటలో ఓ ఇంటిపై కూలిన భారీ వృక్షం

గాలివాన బీభత్సం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటతో పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. గూడురులో పార్కింగ్ చేసిన కారుపై భారీ చెట్టు పడడంతో కారు పాక్షికంగా ధ్వంసం అయింది. చండీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సెల్ టవర్ కూలి విద్యుత్ తీగలపై పడడంతో మండల కేంద్రంలో అంధకారం నెలకొంది.



విద్యుత్ తీగలపై పడిన సెల్ టవర్



కారుపై పడిన మర్రిచెట్టు

అభిషేకాలు.. అక్షరస్వీకారాలు

సందడిగా విద్యాధరి, నాచగిరి క్షేత్రాలు



విశేషాలంకరణలో వర్గల్ సరస్వతీ అమ్మవారు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన వర్గల్ విద్యాధరి, నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. వర్గల్ విద్యాసరస్వతీ సన్నిధిలో పెద్దసంఖ్యలో చిన్నారుల అక్షరాభ్యాసాలు జరిగాయి. నాచగిరి క్షేత్రంలో భక్తజనులు స్వామివారికి నిజాభిషేకం జరిపించి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రంలో 26 అభిషేకాలు, 5 కల్యాణాలు, 17 వ్రతాలు జరగగా, వర్గల్ క్షేత్రంలో 300 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగినట్లు ఆయా ఆలయవర్గాలు పేర్కొన్నారు.




వర్గల్‌లో చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి

జరిగింది కొంతే..

జరగాల్సింది చాలా ఉంది..

- సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ
- రచయిత, ఉద్యమకారుడు, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి



నందిని సిధారెడ్డి పరిచయం అక్కర్లేని పేరు. పాటల రచయితగా.. తెలంగాణ రావాలని తపించిన వ్యక్తిగా సమాజానికి సుపరిచితులే. రెండు దశల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యమంలో ఎక్కడ సభ జరిగినా పాల్గొని రాష్ట్ర ఆవశ్యకతపై మాట్లాడేవారు. తన వంతు పాటలు కూడా రాసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రత్యేక రాష్ట్రంలో సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ గానూ బాధ్యతలు నిర్వర్తించిన సిధారెడ్డి తెలంగాణకు పదేళ్లు నిండిన సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే.. – సాక్షి, సిద్దిపేట

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని చిన్ననాటి నుంచి కలలు కన్నా. అందుకే తొలి, మలి దశ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నాను. 1969లో తెలంగాణ కోసం ఉద్యమం జరిగినప్పుడు నేను 9వ తరగతి చదువుతున్నాను. దుద్దెడలో జరిగిన రాస్తారోకోలో పాల్గొనడం బాగా గుర్తుంది. అనంతరం చదువు పూర్తయ్యాక 1 నవంబర్ 1996లో మలి దశ ఉద్యమంలో భాగంగా గాంధీభవన్‌లో జరిగిన సమావేశానికి హాజరయ్యాను. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా వ్యవహరించాలని భావించి 26 నవంబర్ 1996న మంజీర రచయితల సంఘం తీర్మానం చేసింది. ఆతర్వాత ఏడాది(1997) మార్చి 8, 9వ తేదీల్లో భువనగిరిలో హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గర్జన పేరుతో సభ పెట్టారు. అక్కడ తెలంగాణ సంస్కృతిపై మాట్లాడాను. దీంతో అప్పటి పోలీస్ ఆఫీసర్ సదాశివరావు బెదిరింపులకు గురిచేశారు.

➡ నాగేటి సాళ్లల్లో నా తెలంగాణ..

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయాన జన బాహుళ్యంలోకి వెళ్లేలా, ప్రజలను ఆలోచింపచేసేలా పాటలు కావాలని 'నాగేటి సాళ్లల్లో నా తెలంగాణ' పాట రాశాను. సిద్దిపేట బాలికల హైస్కూల్‌లో 17 ఆగస్టు 1997న జరిగిన సభలో నేను రాసిన పాట పాడాను. ఈ పాట ప్రజలకు బాగా దగ్గరైంది. 27 డిసెంబర్ 1997న అమరవీరుల జోహార్లు అనే పాటను రాశాను. ఇలా దాదాపు తెలంగాణ ఉద్యమంలో సుమారుగా ఆరు పాటలు స్వయంగా రాయడమే కాక 200 సభల్లో పాల్గొని వక్తగా ప్రసంగించాను.

➡ రచయితల సంఘాన్ని విస్తరించాం

కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించారు. తనకు మద్దతూ తెలుపుతూ ఉద్యమంలో పాల్గొన్నాం. తెలంగాణ ఉద్యమంలో సబ్బండ వర్గాలను ఒక తాటిపైకి తీసుకురావాలనుకున్నాం. ఇందుకు 2001లో తెలంగాణ రచయిత సంఘాన్ని ఏర్పాటు చేశాం. 2002లో కరీంనగర్‌లో తొలి అధ్యక్షుడిగా నన్ను ఎన్నుకున్నారు. 2002లో మొదటి సభ వరంగల్‌లో జరిగింది. భావ జాలం, వ్యాసాలు, కవితలను విస్తరింపచేయాలని 'సోయి' అనే త్రైమాసిక పత్రిక తీసుకవచ్చాం. 2004లో విద్యావంతుల వేదికను సైతం ఏర్పాటు చేశాం. 2004లో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ వాదులనే గెలిపించాలని అందరం ప్రచారం చేశాం. అప్పటి టీఆర్ఎస్, కాంగ్రెస్ కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా సీఎంగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆపై తెలంగాణ ఉద్యమంలో అందరం పాల్గొని 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం.

➡ కళాకారులకు ప్రాధాన్యత



రాష్ట్ర సాధనలో కృషి చేసిన కళాకారులు, గాయకులకు ఉపాధి కల్పించేందుకు సాంస్కృతిక సారథుల పేరిట సుమారు 500 మందికి ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. మొదటి రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కవులు, కళాకారులు, రచయితలకు ఘనంగా సన్మానించారు. 2015 నుంచి దాశరథి, కాళోజీ పేరట పురస్కారాలను అందజేశారు. 2 మే 2017లో తెలంగాణ సాహిత్య అకాడమీని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసి తొలి చైర్మన్‌గా నన్ను నియమించారు. డిసెంబర్ 2017లో తొలిసారి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి 42 దేశాలు, దేశంలోని 18 రాష్ట్రాల నుంచి తెలుగు ప్రతినిధులను ఆహ్వానించాం. ఈ సభల సందర్భంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 120 ద్వారాలను కవులు, రచయితల పేర్ల మీదగా ఏర్పాటు చేయగా అందులో సిద్దిపేటకు చెందిన కాపురాజయ్య, వేముగంటి నర్సింహచార్యులు పేర్లు కూడా ఉన్నాయి.

ఇంకా చాలా జరగాలి..

2019 సంవత్సరం వరకు సాహితీ రంగానికి అప్పటి సీఎం కేసీఆర్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఆ తర్వాత సరిగా పట్టించుకున్నట్లు కనిపించలేదు. 2022లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాల్సి ఉన్నా జరగలేదు. సీనారే పేరిట నిర్మిస్తానన్న స్మారక భవన్ అమలుకు నోచుకోలేదు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెడతారన్న ప్రకటన ఆచరణ రూపం దాల్చలేదు. గాయకులు, రచయితలు, కళాకారులను ఇంకా కొందరిని సాంస్కృతిక సారథుల నియమించడమేకాక తెలంగాణ జానపద, లలిత కళా అకాడమీలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

అవి రాచరిక చిహ్నాలు కాదు...

కాకతీయుల ఆనంద వేడుకలకు గుర్తుగా కాకతీయ తోరణాన్ని నిర్మించారు. తెలంగాణలో చెరువులు ఉన్నాయంటే అవి కాకతీయ రాజుల చొరవే. హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి వచ్చి 10వేల మంది మృతి చెందంతో వారికి గుర్తుగా చార్మినార్‌ను కుతుబ్ షాహి నిర్మించారు. తెలంగాణ రాజముద్రలో ఉన్న కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించడాన్ని చరిత్రపై అవగాహన లేని వారు చేసిన పనిగా భావిస్తున్నా. గతంలో పూర్తి చేయని పనుల కోసం నిపుణుల కమిటీని ఏర్పాటుచేయాలి. మన కలల్ని, సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వనదుర్గమ్మా.. దీవించమ్మా

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వనదుర్గా ఆలయం ఆదివారం వేలాది భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు దుర్గమ్మకు పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఒడి బియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా చైర్మన్ బాలాగౌడ్, ధర్మకర్తలు చర్యలు తీసుకున్నారు.



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

'ఉద్యమకారులను ఆదుకోవాలి'

రామాయంపేట(మెదక్): తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా ప్రతినిధి పోలీస్ దేవేందర్ ఆరోపించారు. ఆదివారం ఆయన రామాయంపేటలో మాట్లాడుతూ.. ఉద్యమంలో పాల్గొని కేసుల పాలై ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గురించి గత ప్రభుత్వం పట్టించుకోకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత


నిందితుడిని పట్టుకున్న భూంపల్లి పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, భూంపల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మిరుదొడ్డి మండలం ధర్మారానికి చెందిన వంగ నరేశ్, సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన కేషన్నగారి నరేష్‌రెడ్డి ఇద్దరు కలిసి వివిధ గ్రామాల్లో తక్కువ రేటుకు రేషన్ బియ్యాన్ని కొన్నారు. ఎక్కువ రేటుకు అమ్మేందుకు 130 క్వింటాళ్లు డీసీఎంలో తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు భూంపల్లి శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, భూంపల్లి పోలీసులు పట్టుకున్నారు. డీసీఎంను.. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

కేబుల్ వైర్ల చోరీ


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వ్యక్తులు స్టార్టర్, మోటారు, బోరుబావుల కేబుల్ వైర్లు శనివారం అర్ధరాత్రి చోరీ చేశారని రైతులు నిరసన తెలిపారు. మండల పరిధిలోని నానుతండాకు చెందిన 15 మంది రైతుల మోటారు, బోరుబావులకు చెందిన వైర్లు ఎత్తుకెళ్లారన్నారు. గ్రామ పంచాయతీ బోరుబావి కేబుల్ సైతం చోరీ చేశారన్నారు. కొత్త కేబుల్ కనెక్షన్ కోసం బోరులో నుంచి మోటారు పైకి లేపి దింపేందుకు 5 వేల వరకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చోరీపై శివ్వంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే దొంగలను పట్టుకోవాలని రైతులు బుచ్చనాయక్, బాల్‌సింగ్, గన్యా, సాలేరాం, శంకర్, రాంలునాయక్, మోతీసింగ్ తదితరులు డిమాండ్ చేశారు.

పిడుగుపాటుకు గేదె మృతి

మద్దూరు(హుస్నాబాద్): పిడుగుపాటుతో గేదె మృతిచెందిన సంఘటన ఆదివారం సాయంత్రం వల్లంపట్లలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లంపట్లకు చెందిన రైతు నారదాసు రవికి చెందిన పాడి గేదె ఆదివారం పిడుగుపాటుకు గురై మృత్యువాత పడింది. విలువ రూ.90వేల ఉంటుందని బాధితుడు వాపోయాడు.

దృష్టి పెట్టండి


భూవివాదాలపై ఎస్‌ఐలతో సమీక్షిస్తున్న సీఐ రవి

జహీరాబాద్ టౌన్: భూ వివాదాల్లో బయటి వ్యక్తులు బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ టౌన్ సీఐ రాజబోయిన రవి హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది భూ తగదాల్లో జోక్యం చేసుకొని అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్ మండలాల్లో గ్యాంగులుగా ఏర్పడి వ్యవసాయ భూములు, ఇంటి స్థలాల క్రయవిక్రయాల్లో తలదూర్చి తగదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వ్యక్తులపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. భూతగాదాల కేసులు పోలీస్‌స్టేషన్‌లో పరిష్కారం కావని, సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాలన్నారు. సీఐ వెంట ఎస్‌ఐలు లక్ష్మారెడ్డి, ప్రసాద్, నరేష్, కృష్ణ ఉన్నారు.

వానాకాలం సాగు

● సంగారెడ్డి జిల్లాలో 7.40 లక్షల ఎకరాలు ● పత్తి సాగు 3.60 లక్షలు.. వరి 1.41 లక్షల ఎకరాలు



జహీరాబాద్: ఈ ఏడాది సంగారెడ్డి జిల్లాలో 7.40 లక్షల ఎకరాల్లో వానా కాలం పంటలు సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ అంచనాకు వచ్చింది. ప్రధానంగా పత్తి, వరి, కంది, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, పెసర పంటలు సాగు కానున్నాయి. ఈ ఏడాది పత్తి పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యే అవకాశం ముంది. దాని తర్వాత స్థానంలో వరి.. ఇది 1.41 లక్షల ఎకరాల్లో సాగు కానుందని అంచనా. 64 వేల ఎకరాల్లో సోయాబీన్, 11 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 4,600 ఎకరాల్లో మినుము, 7,650 ఎకరాల్లో పెసర పంట సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాకు వచ్చింది. పచ్చిరొట్టె ఎరువులు, జనుము విత్తనాలను ఇప్పటికే మొదటి విడత కింద రైతులకు అందించింది. రెండో విడత కింద సరఫరాకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకనుగుణంగా విత్తనాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. 1.25లక్షల మెట్రిక్ టన్నుల మేర ఆయా రకాల ఎరువులు అవసరం ఉంటుంది. కాగా, నిల్వలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేసింది.

నకిలీ విత్తనాలకు తావుండదు

సంగారెడ్డి జిల్లాలో నకిలీ విత్తనాల మాటే లేదు. పక్క రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాకుండా రాష్ట్ర సరిహద్దు వద్ద వ్యవసాయ శాఖ తరపున కట్టుదిట్టమైన నిఘా పెట్టాం. పత్తి విత్తనాలు మినహా ఇతర విత్తనాలన్నింటినీ రైతులకు రాయితీ లేకుండా అందించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా విత్తనాలు అందిస్తాం. రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే లైసెన్సు కలిగి ఉన్న డీలర్ల వద్దే కొనాలి. కొన్న వాటికి రసీదులు పొంది జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. ఎరువుల విషయంలో రైతులు ఏ మాత్రం ఆందోళన చెందవద్దు. అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయి.



కాళ్ల కడియాల కోసమే మహిళ హత్య


హత్య కేసులో నిందితులను చూపుతున్న పోలీసులు

పాపన్నపేట(మెదక్): మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. కాళ్ల కడియాల కోసమే చంపినట్లు పోలీసులు వెల్లడించారు. మెదక్ రూరల్ సీఐ కేశవులు కథనం ప్రకారం.. పాపన్నపేట మండలం సీతనగరానికి చెందిన ఎరుకల అమృత(40) బుధవారం ఇదే గ్రామానికి చెందిన యాదమ్మతో పాపన్నపేట సంతకు వచ్చింది. యాదమ్మకు అంతకు ముందే పరిచయం ఉన్న చిలిప్‌చెడ్ మండలం చిట్కుల్‌కు చెందిన బన్సిలాల్ కూడా ఇక్కడికి వచ్చాడు. ఈ ముగ్గురు కలిసి ఒక వైన్స్ వెనుకాల మద్యం తాగారు.

అనంతరం వెండి కడియాల కోసం బన్సిలాల్, యాదమ్మ ఇద్దరు కలిసి అమృతను హత్య చేసి, ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాలుగు రోజుల్లో ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వెండి వస్తువులు, బైక్, సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నల్లపోచమ్మదేవి ఆలయ ఈఓగా రంగారావు


రంగారావు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం ఈఓగా రంగారావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఈఓ మోహన్‌రెడ్డి మే 31న పదవీ విరమణ పొందారు. దీంతో ఆలయానికి కొత్తగా సంగారెడ్డిలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రంగారావు.. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ ఆలయం ఈఓగా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తొలుత ఇక్కడికి ఈఓగా శ్రీనివాస్ వస్తున్నట్లు ప్రచారం జరగగా వివిధ పార్టీల నాయకులు, భక్తులు ఆయన వద్దని వ్యతిరేకిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారికి ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీంతో రంగారావును ప్రభుత్వం నియమించింది.

సంగమేశ్వరుడి సన్నిధిలో కౌంటింగ్ పర్యవేక్షకులు


ఆలయంలో అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ పర్యవేక్షకులు ప్రదీప్‌సింగ్ సంగవత్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయానికి వచ్చిన వారికి అలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు చేసి వారు మొక్కులు చెల్లించారు. అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీశ్వర్, ఆలయ అర్చకులు సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ దగ్ధం

పశువుల కొట్టం, గడ్డివాము కూడా


కాలిపోయిన ట్రాక్టర్, కాలుతున్న గడ్డివాము

తొగుట(దుబ్బాక): ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడి మంటలు అంటుకుని ట్రాక్టర్, పశువుల కొట్టం, గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని లింగాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసని మహిపాల్ రోజూ మాదిరిగా మధ్యాహ్నం సమయంలో పశువులకు నీటిని తాగించేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడ నీరు పెట్టేందుకు బోరు మోటారు ఆన్ చేశాడు. ఈ క్రమంలో భారీగా ఈదురుగాలులు వీచడంతో సర్వీస్ వైరు మధ్యలో తెగి గడ్డివాము నుంచి వరి కొయ్యలకు మంటలు వ్యాపించాయి. ఇవి సమీపంలోని ట్రాక్టర్‌కు నిప్పంటుకున్నాయి. దీంతో కొట్టం నుంచి మూగజీవాలు పరుగులు తీశాయి. కాగా, బాధిత రైతు మహిపాల్.. తోటి వారిని సమీకరించుకొని అక్కడికి చేరుకునే లోపే ట్రాక్టర్, గడ్డివాము, పశులపాక పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటనలో సుమారు రూ.5 లక్షల నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

చండీలో గడ్డివాము కూడా

శివ్వంపేట(నర్సాపూర్): గడ్డివాము దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని చండీలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తలారి నర్సింహులు తన వ్యవసాయ పొలం వద్ద నిల్వ ఉంచాడు. 350 గడ్డి మోపుల వామును గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. దీంతో కాలిబూడిదైందని రైతు వాపోయాడు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు


సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సిద్దిపేటఅర్బన్: అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని, నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను అరికట్టి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సిద్దిపేటలోని ఆపార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు.. సన్న రకం ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని అనడం సరికాదన్నారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గడువు లోపు రుణమాఫీ చేసి కొత్తగా పంట రుణాలివ్వాలన్నారు. పంట బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకుంటే ఉద్యమాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, రవికుమార్, కృష్ణారెడ్డి, బాలనర్సయ్య, శ్రీనివాస్, ప్రశాంత్, శారద, నవీన, రవీందర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం



రాష్ట్ర కార్మిక శాఖ సెక్రటరీ గంగాధర్ నుంచి అవార్డు అందుకుంటున్న అమీనాబాను

సిద్దిపేటజోన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం ఉచితంగా శిక్షణ అందిస్తున్న సిద్దిపేట జిల్లా సెట్విన్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక సంక్షేమ శాఖ రాష్ట్ర సెక్రటరీ గంగాధర్ నుంచి జిల్లా సెట్విన్ ఇన్‌చార్జి అమీనాబాను అవార్డు అందుకున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయకర్తగా కీలక పాత్ర పోషించిన అమినాను అభినందించారు. కార్యక్రమంలో సెట్విన్ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్స్‌తో ఐదుగురి జాడ

● హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తింపు
● కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు

రామాయంపేట, హవేళీఘన్‌పూర్ (మెదక్): గతేడాదిగా కనిపించకుండా పోయిన ఐదుగురిని పోలీసులు పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తెలిసిన వివరాల ప్రకారం.. హవేళీఘనపూర్ మండలం లింగ్సాన్‌పల్లి తండాకు చెందిన మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇదే గ్రామానికి చెందిన వ్యక్తితో ఏడాది క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు ఆమె భర్త, సోదరుడు సురేశ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎంత గాలించానా ఆచూకీ లభించలేదు. కుటుంబసభ్యుల ఆవేదనను అర్థం చేసుకొని.. 'ఆ ఐదుగురు ఎక్కడ' అనే పేరిట గత నెల 31 సాక్షి దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన పోలీసులు సెల్ సిగ్నల్స్ సహాయంతో హైదరాబాద్‌లో ఉన్నట్లు కనిపెట్టారు. ఇక్కడి వెళ్లి ఆదివారం హవేళీఘనపూర్ స్టేషన్ తీసుకొచ్చారు. ఈ మేరకు మహిళను ఆమె పిల్లలను ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ కుటుంబసభ్యులకు అప్పగించారు.

బస్టాండ్‌లో గుర్తు తెలియని మృతదేహం


వృద్ధురాలి మృతదేహం

తూప్రాన్: వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని 65 ఏళ్ల వయసు గల వృద్ధురాలి మృతదేహాన్ని ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తించారు. ఆమె కొన్ని రోజులుగా బస్టాండ్ ఆవరణలో భిక్షాటన చేస్తున్నట్లు పోలీసులకు స్థానికులు తెలిపారు. మృతురాలికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కుళ్లినస్థితిలో...

మునిపల్లి(అందోల్): కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటన మునిపల్లి మండలంలో చోటుచేసుకుంది. బుదేరా ఎస్‌ఐ సురేష్ కథనం ప్రకారం.. కంకోల్ గ్రామశివారులో కుళ్లిపోయిన శవాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. వారు పరిశీలించి వివరాల కోసం ఆరా తీశారు. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కొమిషెట్టిపల్లికి చెందిన కుమ్మరి కిష్టయ్య (60)గా తెలిసింది. మూడేళ్ల నుంచి అతడి మానసిక పరిస్థితి సరిగా లేదు. వారం రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి రోడ్లపై సంచరిస్తున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ చనిపోయి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించాడు. ఆ మేరకు డెడ్ బాడీని కుటుంబసభ్యులకు పోలీసులు అందజేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


సుశాంత్(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన శివ్వం పేటలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి కథనం ప్రకారం... హన్మకొండ జిల్లాకు చెందిన కనుకుంట్ల సుశాంత్ (35) మండల పరిధిలోని పెద్దగొట్టిముక్లలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ చింతల్‌లో నివాసం ఉంటున్నాడు. గోమారం సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గతనెల 28న సబ్‌స్టేషన్‌లో విధులు ముగించుకొని బైక్‌పై చింతల్ వెళ్తుండగా చిన్నగొట్టిముక్ల గ్రామ శివారు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా ఇక్కడ చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులోగల జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండలం సుతారిపల్లికి చెందిన ఎర్రుల మురళి ఆదివారం రాత్రి బస్వాపూర్ శివారులో రోడ్డు దాటుతున్నాడు. హైదరాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మురళిని స్థానికులు వెంటనే కామారెడ్డిలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

జహీరాబాద్: పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో డీఏఓ అంబికాసోని, కలెక్టరేట్ ఏడీఏ శ్రీనివాస్ ప్రసాద్, జహీరాబాద్ మండల వ్యవసాయాధికారి ప్రవీణ పాల్గొన్నారు.

ఉత్సవాలకు తరలిన ఉద్యమకారులు


ఉత్సవాలకు తరలి వెళుతున్న ఉద్యమకారులు

నారాయణఖేడ్: హైదరాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు పట్టణంలోని ఉద్యమకారులు పలు వాహనాల్లో తరలివెళ్లారు.

ప్రారంభించారు.. తరలించారు!

● మౌలిక సదుపాయాల్లేవని గురుకులాల తరలింపు
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
● స్థలాలున్నా సొంత భవనాలకు నోచని వైనం
● ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజల వినతి
● జగదేవ్‌పూర్‌లో దుస్థితి


గురుకుల భవనాల కోసం గుర్తించిన స్థలం ఇదే


జగదేవ్‌పూర్‌లో గురుకులాలను ప్రారంభించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మూడు గురుకులాలు ప్రారంభించిన తర్వాత ఒక్కొక్కటిగా ఇక్కడ నుంచి తరలించారు. భవనాల కొరత కారణంగానే ఇలా చేశారని తెలుస్తోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు శ్రీకారం చుట్టగా జగదేవ్‌పూర్ మండలానికి మూడు గురుకులాలు మంజూరయ్యాయి. ఇవి.. బీసీ బాలికల పాఠశాల, ఎస్సీ బాలికల పాఠశాల, బీసీ బాలుర పాఠశాల. మూడేళ్ల క్రితం వాటిని ప్రారంభించారు. తర్వాత మౌలిక సదుపాయాల కొరత వల్ల బీసీ బాలికల పాఠశాల జవదేవ్‌పూర్ నుంచి వర్గల్ గోరారం వద్దకు తరలించారు. ఎస్సీ బాలిక పాఠశాల కూడా గజ్వేల్ మండలం రిమ్మానగూడకు, బీసీ బాలుర పాఠశాలను ప్రజ్ఞాపూర్ పాతూరు చౌరస్తా వద్దకు తరలించారు. ఈ మూడు కూడా ఎస్సీ, బీసీ హాస్టల్ వసతి గృహంలోనే ప్రారంభించడం విశేషం. కాగా, ఇక్కడి పరిస్థితులనుగుణంగా ఒక దాని తర్వాత ఒకటి ప్రారంభించి ఒక్కొక్కటిగా తరలించారు అధికారులు. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 41 ఎకరాల స్థలంలో బీసీ బాలుర, బాలిక గురుకులం పాఠశాలల భవన నిర్మాణాల కోసం స్థలం పరిశీలన చేశారు. కానీ ఆ సమయంలో నిధులు మంజూరు కాలేదు. అయితే ఎస్సీ బాలిక పాఠశాలకు కూడా గొల్లపల్లిలో ఐదెకరాల స్థలాన్ని సైతం గుర్తించారు. దీనికి సైతం నిధులు మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని చూశారు. కానీ నాటి నుంచి నేటి వరకు ఎలాంటి పనులు చేపట్టిన దాఖలాలు లేవని గ్రామాల ప్రజలు చెబుతున్నారు. భవన నిర్మాణాలకు స్థలాలు ఉన్నాయని, కేవలం నిధులను మంజూరు చేస్తే సరిపోతుందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్తాను

జగదేవ్‌పూర్ మండలానికి బీసీ, ఎస్సీ గురుకులాలు మంజూరు కావడంతో సొంత భవనాలు లేవు. విద్యార్థులకు తగిన వసతులు లేకపోవడం వల్ల ఇతర మండలాల్లో కొనసాతుండటం వాస్తవమే. గురుకులాలకు సొంత భవనాల కోసం గతంలో స్థలాలను గుర్తించారు. నిధులు మంజూరు కాక భవనాల నిర్మాణం జరగలేదు. ఇదే విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకుపోతాను.

–ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ, జగదేవ్‌పూర్